# పూర్వ విద్యార్థులు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలి

## విద్యార్థులు ఎదిగితే పాఠశాలకు గర్వకారణం

## ఆల్ఫోన్స్ ప్రిన్సిపాల్ సంతోష్ రెడ్డి

తిమ్మాపూర్, జనతా న్యూస్ : పూర్వ విద్యార్థులు తమ జూనియర్లకు ఆదర్శంగా నిలువాలని, తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో నిల్వడం తమకు, తమ పాఠశాలకు గర్వ కారణంగా ఉందని సెయింట్ ఆల్ఫోన్స్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్ లో గల సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో అలుమినీ 2026 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ తుమ్మ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అలుమినీలో 1989 నుండి 2025 వరకు పదో తరగతి చదివిన విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో




గెలుపొందిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులతో మెడల్స్ ని అందింపజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్ ని సన్మానించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ సన్మానించి జ్ఞాపికలను అందించారు. పూర్వ విద్యార్థులకు మెమెంటోలను ప్రిన్సిపాల్ అందజేశారు. పూర్వ




విద్యార్థులు తమతమ అభిప్రాయాలను, పాఠశాలతో ఉన్న అనుబంధాలను గుర్తు చేశారు. రాబోవు రోజుల్లో తమ పాఠశాలకు తమవంతు సాయాన్ని అందజేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ తుమ్మ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులకు ఆల్ఫోన్స్ పాఠశాల అమ్మ ఒడి లాంటిదని, 37 ఏళ్ల నుండి వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించి బయటకు వెళ్లారని, వారందరూ తమ కుటుంబ సభ్యులేనని అన్నారు. తమ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ స్థాయిలో ఉండడం సంతోషంగా ఉందన్నారు. తమ పాఠశాలకు సహాయసహకారాలు అందించేందుకు విద్యార్థులు ముందుకు రావాలని ఆయన కోరారు. తప్పకుండా పూర్వ విద్యార్థులు ఎప్పుడు పాఠశాలకు వచ్చిన తాము ఆహ్వానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మొదటి బ్యాచ్ విద్యార్థులు ఎం.లక్మారెడ్డి, రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, డి.లక్ష్మారెడ్డి, కృష్ణ పాల్గొనగా, పాఠశాల ఉపాధ్యాయులు మంగీలాల్, అమర్ సింగ్, ఈర్షాద్, రాజేశ్, రవీందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

## ఎస్ యూ రిజిస్ట్రార్ సతీష్ కుమార్

## శ్రీచైతన్యలో ఘనంగా సమ్మోహనం 2026



తిమ్మాపూర్, జనతా న్యూస్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి ఉన్న స్థాయికి ఎదగాలని శాతావాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ సూచించారు. శ్రీ చైతన్య ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ ఇంజినీరింగ్ కళాశాలలో సమ్మోహనం 2026 పేరుతో కళాశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాతావాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... ఇంజినీరింగ్ విద్యార్థులు మారుతున్న కాలాణుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థులు సబ్జెక్టులపై పట్టును సాధించాలని, కంపెనీలు స్థాపించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదుగాలని అన్నారు. భవిష్యత్తులో సమాజాభివృద్ధికి తోడ్పాటును అందించాలని విద్యార్థులకు సూచించారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎం.టెక్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. ప్రపంచ స్థాయిలో పోటీతత్వాన్ని ఎదుర్కొనేందుకు నిరంతర అభ్యాసం, నవీన ఆవిష్కరణలు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాల సాదనలో కృషి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ప్రధానమని అన్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు తమ సంస్థ రాజీ లేకుండా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడానికి అకాడమిక్ తోపాటు పాఠ్య కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు సమ్మోహనం 2026 ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యలో, క్రీడల్లో మరియు ఇతర రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎం.టెక్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య అనుబంధ సంస్థల ప్రిన్సిపాళ్లు డాక్టర్ జి. వెంకటేశ్వర్లు, డాక్టర్ రామ్ నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, డాక్టర్ స్వర్ణలత, జగన్ మోహన్ రెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ జి శ్రీనివాసు, డిపార్ట్ మెంట్స్ అధిపతులు డాక్టర్ పి.కిషోర్, డాక్టర్ చాడ సంపత్ రెడ్డి, డాక్టర్ ఎ ప్రవీణ్, డాక్టర్ పి శ్రావణ్ కుమార్, గుర్రం శ్రీనివాస్, ఇంచార్జిలు డాక్టర్ బాలకిషన్, రాంకుమార్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ ఎన్. ఉదయ్ కుమార్ నాగరాజు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో కాషాయ విజయంతో కాంగ్రెస్‌కు ‘కౌంట్‌డౌన్’ ప్రారంభం: శాంతి కుమార్

## కరీంనగర్ సెంటిమెంట్ గుబులు మొదలైంది... రాష్ట్రంలో భవిష్యత్తు బీజేపీదే





కరీంనగర్, జనత న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం తొలిసారిగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం శుభ పరిణామమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ గడ్డ నుంచే రాష్ట్ర రాజకీయ చరిత్రను మలిచే అనేక ఘటనలు జరిగాయని, ‘కరీంనగర్ సెంటిమెంట్’ అన్ని పార్టీలలో గుబులు రేపుతోందని అన్నారు. శనివారం కరీంనగర్‌లోని సాయి మహాలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 జిల్లా కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, భవిష్యత్తు అంతా బీజేపీదేనని ధీమా వ్యక్తం చేశారు. ఉచితాలు, హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై కాకుండా రాజకీయ పరిరక్షణపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. వచ్చే నెలలో జరగనున్న ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణం ద్వారా సంస్థ నిర్మాణం, సంస్థ నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం సాధ్యమని పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సూచించిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శిక్షణ కార్యక్రమానికి సంబంధించి కార్యాచరణ వివరాలను పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు నిర్మలారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఈనెల 23న గాగిరెడ్డిపల్లెలో మల్లికార్జున స్వామి జాతర..

## భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్న జాతర నిర్వాహకులు...



చిగురుమామిడి,జనత న్యూస్:మండలంలోని గాగిరెడ్డిపల్లె గ్రామంలో ఈనెల 23న సోమవారం శ్రీ యాలాల మల్లికార్జున స్వామి జాతరను యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వాహకులు దొంతరవేణి వెంకన్న యాదవ్,చేన్నవేని మల్లయ్యలు తెలిపారు.22ఆదివారం సాయంత్రం ఆలయం చుట్టూ బండ్లు తిరుగుట,23న ఒగ్గు పూజారులచే స్వామివారి కల్యాణ మహోత్సవం,మల్లన్న పట్నాలు,బోనాలు చెల్లించుట శివసత్తుల పూనకాలచే జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై జాతరను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చెన్నవేని అజెయ్, చెన్నవేని సతీష్,దొంతరవేణి రాజయ్య, ముక్కెర కొమురయ్య, ముక్కెర హరీష్,చెన్నవేని సతీష్,తదితరులు ఉన్నారు.

# మాడ్యులస్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా రజితోత్సవ వేడుకలు



సిద్దిపేట, ఫిబ్రవరి 21: స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మాడ్యులస్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాతృభాష ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఉపాధ్యాయులు కాచం శ్రీనివాస్, రమేష్ మాతృభాష గొప్పతనం, భాషా సంస్కృతి పరిరక్షణ అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల కోసం వ్యాసరచన, ప్రసంగం, పద్యపఠనం వంటి పలు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఇస్కాన్ సంస్థ నిర్వహించిన వ్యాల్యూ ఎడ్యుకేషన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ అల్లాభక్షు మాట్లాడుతూ భాష అభివృద్ధి దశలు, మాతృభాష ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

## -రాజీవ్ రహదారిపై కారు, బైక్ ఢీ -మామ, అల్లుడు మృతి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం ఉదయం రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, బైక్ ఢీకొనగా మామ అల్లుడు మృతి చెందారు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మానకొండూర్ మండలం కొండపల్కల కు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు శ్రీరాముల రామచంద్రం, ఆయన అల్లుడు హుస్నాబాద్ కి చెందిన అవుదుర్తి శ్రీనివాస్ కలిసి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లికి బైక్ పై వెళ్తున్నారు. రామంచంద్రం మరదలు తోటపల్లిలో మరణించగా అంత్యక్రియలకు వెళ్తూ కొత్తపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు వంతెన వద్ద రాగా బైక్ ని వెనుక నుండి అతివేగంగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో రాంచంద్రం అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీనివాస్ ని చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మామ, అల్లుడు మృతి చెందడంతో వారి కుటుంభాల్లో, రెండు గ్రామాల్లో విషాదం నెలకొంది. విషయం తెల్సుకున్న తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్ఎండీ ఎస్సై అన్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేపట్టారు.

# చిగురుమామిడి మండల విద్యాధికారిగా జయప్రద నియామకం



చిగురుమామిడి,జనత న్యూస్: చిగురుమామిడి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) గా ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ... మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో విద్యాశాఖలో చిగురుమామిడి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ధీమా వ్యక్తం చేశారు. జయప్రద నియామకం పట్ల స్థానిక ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యావేత్తలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

